క్లుప్తంగా

నేడు ఆనంవారిపల్లెలో ఉచిత వైద్యశిబిరం

బి.కోడూరు : మండలంలోని ఆనంవారిపల్లె స్కూల్‌లో ఆదివారం ఉదయం 8 గంటలకు బద్వేలులోని బంగారుశీనయ్య ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో వైద్యులు డాక్టర్ గానుగపెంట రాహుల్ వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వైద్యశిబిరంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో పవళింపు సేవ



పవళింపు సేవలో అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి పవళింపు సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా నూతన పట్టువస్త్రాలు, పూలతో, ఆభరణాలతో అలంకరించి పవళింపు సేవను వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. కార్యక్రమానంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పాలక మండలి సభ్యులు, వేదపాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరశర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న బద్వేలు నోడల్ డీఎస్పీ రవికుమార్

కలసపాడు : జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాల వెల్లడి దృష్ట్యా ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని బద్వేలు నోడల్ డీఎస్పీ రవికుమార్, పోరుమామిళ్ల సీఐ చిరంజీవి, కలసపాడు ఎస్ఐ నాగమురళి హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో మండల పరిధిలోని వివిధ పంచాయతీలకు చెందిన గ్రామాల్లోని అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ పాటిస్తూ ప్రజలు, రాజకీయ నాయకులు శాంతికి సహకరించాలని కోరారు. ఓట్ల లెక్కింపు రోజు, తర్వాత 144 సెక్షన్, ఎన్నికల కోడ్ అమల్లో ఉంటాయని తెలిపారు. గుంపులు గుంపులుగా ఉండటం, బాణాసంచా పేల్చడం వంటి చర్యలకు పాల్పడకూడదని సూచించారు. ఎన్నికల ఫలితాల అనంతరం గ్రామాల్లో అల్లర్లు, గొడవలు, రెచ్చగొట్టే విధంగా మాట్లాడి ఘర్షణలు సృష్టిస్తే వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసి రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు, పోలీసులు పాల్గొన్నారు.

శ్రీరాముని అలంకారంలో చెన్నకేశవుడు



శ్రీరాముని అలంకారంలో చెన్నకేశవుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీమహాలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున చెన్నకేశవస్వామి, మహాలక్ష్మీదేవి మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం స్వామివారిని హనుమత్‌వాహనంపై సీతారామలక్ష్మణ అలంకారంలో పురవీధుల్లో గోవింద నామ స్మరణల మధ్య ఘనంగా ఊరేగించారు. భక్తులు కాయాకర్పూరాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు.

ఇనగలూరులో నాకాబందీ

తొండూరు : ఇనగలూరు గ్రామంలో ఎస్ఐ లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో శనివారం ఉదయం నాకా బందీ నిర్వహించి అనుమానం ఉన్న ఇళ్లలో తనిఖీలు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ జరగబోయే ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా ప్రశాంతంగా ఉండాలని ప్రజలకు సూచించారు. గొడవలకు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు గ్రామ బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు.

నేత్రపర్వం.. చెన్నకేశవుని రథోత్సవం



వెల్లాలలో చెన్నకేశవ స్వామి రథాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్, ఈఓ



శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వాములు

- భక్తులకు మజ్జిగ, పానకం పంపిణీ
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

రాజుపాళెం: వందలాది భక్తులు జయ జయధ్వనులు చేస్తుండగా.. వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవుడి రథోత్సవం శనివారం కనులపండువగా జరిగింది. రథంపై స్వామి వైభవం తిలకించిన భక్తులు పరవశించిపోయారు. ముందుగా శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ, సంజీవరాయ స్వాముల విగ్రహాలను అలంకరించి రథంలో ఆశీనులను చేశారు. వేద పండితులు హోమం నిర్వహించగా, ఆలయ చైర్మన్ జగదీశ్వరరెడ్డి, ఈఓ నరసయ్య, రూరల్ సీఐ రమణారెడ్డి, ఎస్ఐ తులసీ నాగప్రసాద్ టెంకాయలు కొట్టారు. మహిళలు బోనాలు సమర్పించిన అనంతరం రథాన్ని ముందుకు కదిలించారు. ఆలయ మాడ వీధుల్లో భక్తులు రథం లాగేందుకు పోటీపడ్డారు. ప్రొద్దుటూరు రూరల్ సీఐ రమణారెడ్డి, రాజుపాళెం ఎస్ఐ తులసీ నాగప్రసాద్, రూరల్ ఎస్ఐ శివప్రసాద్‌లు తమ పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



వెల్లాల తిరునాలకు హాజరైన జనసందోహం

భక్తులతో కిటకిట

శ్రీ చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వాముల బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. అంతకుముందు తిరునాలకు వచ్చిన భక్తులు తలనీలాలు సమర్పించి కుందూనదిలో స్నానాలు చేశారు. ప్రొద్దుటూరు మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ అంజనీకుమారి, నాయకులు ప్రవల్లిక, బీరం వెంకటరామిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, జయలక్ష్మమ్మ, జయచంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సంజీవరాయ, లక్ష్మినరసింహ స్వామి ఆలయాల్లో అన్నదానం ఏర్పాటుచేశారు. తిరునాలకు వచ్చిన భక్తులకు పెద్ద పసుపల గ్రామస్థులు మజ్జిగ, బ్యాళ్లు, పానకం పంపిణీ చేశారు. రాజుపాళెం ఎస్ఐ తులసీ నాగప్రసాద్, సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా కాశినాయన ఆలయ వార్షికోత్సవం



నాయునిపల్లెలో కోలాటం వేస్తున్న దృశ్యం

కాశినాయన : మండలంలోని నాయునిపల్లె గ్రామంలో శ్రీఅవధూత కాశినాయన 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. 1993వ సంవత్సరంలో శ్రీఅవధూత కాశినాయన జీవించి ఉండగానే గ్రామస్తులు ఆయనకు ఆలయాన్ని నిర్మించి విగ్రహ ప్రతిష్ట చేశారు. ప్రతి సంవత్సరం ఘనంగా వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శనివారం ఆయన విగ్రహాన్ని మంగళ, డప్పువాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆనంవారిపల్లె గ్రామానికి చెందిన ఆకాంక్షారెడ్డి ఆధ్వర్యంలో వేసిన కోలాటం ఆకట్టుకుంది. ఉదయం 8 గంటల నుంచి రాత్రి వరకు ఉచిత భోజన వసతి, మజ్జిగ పంపిణీ చేశారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని కాశినాయనకు కాయకర్పూరం సమర్పించారు.

విద్యార్థులకు చదువుతో పాటు ఆట, పాట ముఖ్యం



ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులకు పద్యాల గురించి వివరిస్తున్న చదువులబాబు

అట్లూరు :విద్యార్థులకు చదువుతో పాటు ఆట, పాట ఉల్లాసాన్ని కలిగించడంతో పాటు వారిని చైతన్యపరుస్తుందని గ్రంథాలయ అధికారి ఎం.సుధాకర్ తెలిపారు. శనివారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు సమ్మర్ క్యాంపులో భాగంగా దేశభక్తి గేయాలు, నీతి కథలతో పాటు కబడ్డీ, ఖోఖో తదితర ఆటలపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలానుగుణంగా విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో వారి సంప్రదాయ పద్ధతులు అలవరుచుకునేందుకు శరీర దేహదారుఢ్యాన్ని పెంచుకునేందుకు ఆటపాటలు దోహదపడతాయని పేర్కొన్నారు.



అట్లూరు : విద్యార్థులచే దేశభక్తి గేయాలు పాడిస్తున్న గ్రంథాలయ అధికారి సుధాకర్

పద్యపఠనాన్ని అలవర్చుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు పద్యపఠనాన్ని అలవరచుకోవాలని కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డీకే చదువులబాబు పేర్కొన్నారు. స్థానిక వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా విద్యార్థులకు పద్యపఠనంపై అవగాహన కల్పించారు. పద్యపఠనం వలన మానవతా విలువలు పరిమళిస్తాయని, భాషమీద పట్టు వస్తుందన్నారు. వేమన, సుమతీ, శతక పద్యాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో రికార్డు అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్, అధ్యాపకుడు గోపీనాయక్, డ్రాయింగ్ మాస్టర్ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మోక్ష నారాయణుడి బ్రహ్మోత్సవాలు

కమలాపురం : మండల పరిధిలోని రామాపురంలో వెలసిన మోక్ష నారాయణస్వామి ఆలయంలో ఈనెల 21వ తేదీ నుంచి జరుగుతున్న బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. ప్రముఖ వేద పండితులు ఘనాపాటి వంశీకృష్ణ ఆచారత్వమున ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. చివరి రోజు శనివారం ఉదయం మండప అర్చనలు, సర్వ సూక్త పారాయణం, సమస్త పరివార దేవతామూర్తుల హోమాలు, పూర్ణాహుతి, పంచామృత స్నానం, మహా కుంభాభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అశేష భక్త జనులు స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిత్య కల్యాణంలో భాగంగా చేపట్టిన స్వాముల వారి కల్యాణ వేడుకలను భక్తులు చూచి తరించి తన్మయత్వం పొందారు.



గోపురంపై కుంభాభి షేకం చేస్తున్న సాయినాథశర్మ

కున్నాయి.

అంతర్ పంటలతో రైతులకు లాభాలు

పులివెందుల రూరల్: వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగుచేస్తే తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ లాభాలు సాధించవచ్చునని రైతులు అంతర్ పంటలు సాగుచేస్తున్నారు. పులివెందుల ప్రాంతంలో చీనీసాగు చేస్తే అంతర్ పంటలుగా మిరప, టమోట, చిక్కుడు, కలింగర, తదితర పంటలు సాగుచేయడం వల్ల లాభాలు వస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల ఎక్కువశాతం రైతులు తక్కువ విస్తీర్ణంలో రెండు రకాల పంటలు సాగుచేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు.

30 నుంచి ఉచిత వక్త శిక్షణ తరగతులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్టూడెంట్స్ టీచర్స్ ఎడ్యుకేటర్స్ పేరెంట్స్ ఆధ్వర్యంలో ఈ నెల 30, 31 తేదీల్లో నిర్వహించనున్న ఉచిత వక్త శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని స్టెప్ సభ్యుడు పద్మనాభయ్య పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం శిక్షణ తరగతులకు సంబంధించిన పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లా నెక్కల్లులోని సావిత్రమ్మ ధ్యాన ఆరోగ్య ఆశ్రమంలో నిర్వహించనున్న ఈ శిక్షణా శిబిరంలో పాల్గొనే వారికి రెండు రోజుల పాటు ఉచిత శిక్షణ, భోజన, వసతితో పాటు మెటీరియల్ అందిస్తారన్నారు. స్టేజ్ ఫియర్, బాడీలాంగ్వేజ్, వాయిస్ మోడులేషన్, ఆర్ట్ ఆఫ్ టెల్లింగ్ తదితర వాటిలో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తారన్నారు. పాల్గొన దలచిన వారు 29వ తేదీ సాయంత్రం వద్దకు నేరుగా హాజరు కావాలని, మరిన్ని వివరాలకు 9966492234కు సంప్రదించాలని కోరారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, రఘునాథరెడ్డిని సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

పోరుమామిళ్ల: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్సీ గోవిందరెడ్డి అన్నారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద నిర్మించిన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన 9వ వార్షికోత్సవంలో డీసీ గోవిందరెడ్డి, పుల్లీవీడు సర్పంచ్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు జగన్‌మోహన్ ఆచారి, ఆలయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసాచారి, తిరుమలయ్యాచారి ఎమ్మెల్సీ, సర్పంచులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మఠం పీఠాధిపతులతో ఎమ్మెల్సీ ఆలయ అభివృద్ధి గురించి చర్చించారు. అవసరమైన సహకారం అందిస్తామన్నారు. వార్షికోత్సవం సందర్భంగా ఉదయం వేదపారాయణం, అఖండస్థాపన, మూల విరాట్‌కు పంచామృతాభిషేకం, సహస్రనామ పుష్పాభిషేకం అనంతరం గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వాముల శాంతి కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.

ప్రభుత్వాసుపత్రుల్లో గర్భిణులకు ప్రసవం సురక్షితం



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లేష్

బి.కోడూరు : ప్రభుత్వాసుపత్రుల్లో గర్భిణులకు ప్రసవం సురక్షితమని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లేష్ తెలిపారు. బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పు అయ్యేలా ప్రోత్సహించాలని సూచించారు. శనివారం పీహెచ్‌సీలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో మొదటి కాన్పుకు ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన కింద రూ.5 వేలు నగదు ప్రోత్సాహకం అందిస్తామని తెలిపారు. అడల్ట్ బీసీజీ గురించి ప్రజలకు తెలియజేసి బీసీజీ టీకా వేయాలన్నారు. అలాగే పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినీత్ కుమార్ ఆర్‌సీహెచ్, సీఎస్ఎస్‌హెచ్, హెచ్ఐఎంఎస్ రిపోర్ట్స్ గురించి తెలియజేశారు. సమావేశంలో సీహెచ్ఓ నాగమణి, పీహెచ్ఎన్ పుష్పాంజలి, సూపర్‌వైజర్స్ జాన్‌విలియం, విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కూల్ బస్సులు నిబంధనలు పాటించాలి



స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న ఎంవీఐ శేఖర్‌రావు

బద్వేలు అర్బన్ : బద్వేలు ఎంవీఐ కార్యాలయ పరిధిలోని 9 మండలాలలో వివిధ ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులను చేరవేసేందుకు ఉపయోగించే బస్సు, మినీవ్యాన్‌లు నిబంధనలు తప్పక పాటించాలని బద్వేలు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్‌రావు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంవీఐ కార్యాలయంలో ఎఫ్‌సీ కోసం వచ్చిన స్కూల్ బస్సులను తనిఖీచేసి సంబంధిత డ్రైవర్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి ఆయా పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్.సి) జారీ చేస్తున్నామని, పాఠశాలలు తెరిచే లోపు ప్రతి ఒక్కరూ తమ బస్సులకు ఎఫ్.సి. చేయించుకోవాలని, ఎఫ్‌సి లేకుండా రోడ్డెక్కితే చర్యలు తప్పవన్నారు. అలాగే పాఠశాలలకు ఉపయోగించే వాహనాలకు హెవీలైసెన్స్ పొంది, 5 సంవత్సరాల అనుభవం ఉన్న సీనియర్ డ్రైవర్లనే నియమించాలని సూచించారు. వాహనం సీటింగ్ కెపాసిటీ మేరకే విద్యార్థులను కూర్చోబెట్టాలని కోరారు. ఖచ్చితంగా ప్రతి వాహనంలో ప్రథమ చికిత్సలకు సంబంధించిన సామాగ్రి, అగ్నిప్రమాద నిరోధక యంత్రాన్ని ఉంచాలని, బస్సు మెట్ల వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలని, ప్రతి బస్సుకు ఒక సహాయకుడిని నియమించాలని సూచించారు. పాఠశాలల బస్సులు నిబంధనలను పాటించకపోయినా, తనిఖీల సమయంలో ఏదైనా లోపాలు ఉన్నట్లు తెలిస్తే కఠిన చర్యలతో పాటు వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఒంటె వాహనంపై చెన్నకేశవుడు



పల్లకిలో ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి సంజీవరాయ స్వామిని ఒంటె వాహనంపై ఊరేగించారు. ముందుగా స్వామికి అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి స్వామి వారిని ఆశీనులు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని భజన పాటలు పాడుకుంటూ స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ చైర్మన్ జగదీశ్వర రెడ్డి, మాజీ చైర్మన్ విజయలక్ష్మి, సర్పంచ్ కానాల రాధ, వైఎస్సార్‌సీపీ నాయకుడు బలరామిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడితే చర్యలు తప్పవు

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వ్యాపార సంస్థల యజమానులు ప్లాస్టిక్‌కవర్లు వాడితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి హెచ్చరించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని పూర్తిగా నిషేధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యాపారస్తులు ప్లాస్టిక్ బదులు గుడ్డ, జనపనార సంచులను వాడాలన్నారు. బయోగ్రేడబుల్ వంటివి కూడా వాడవచ్చన్నారు. ఎవరైనా వ్యాపారస్తులు ప్లాస్టిక్ వాడినట్లు తెలిస్తే రూ.5 వేల నుంచి రూ.40 వేల వరకు జరిమానా విధిస్తామన్నారు. వినియోగదారులు వాడినా రూ.500లు జరిమానా ఉంటుందన్నారు. పట్టణంలో ఉన్న అన్ని టిఫిన్ సెంటర్లు, హోటళ్లలో ఇడ్లీ తయారు చేయుటకు గుడ్డలను మాత్రమే వాడాలన్నారు. పట్టణ ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై తనిఖీలు యదావిధిగా కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, శానిటేషన్ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు



రాజుపాళెం : వెల్లాలలో మొదటి బహుమతి సాధించిన ఎడ్ల యజమానులకు నగదు అందిస్తున్న చైర్మన్, దాతలు



గోపవరం : బండలాగుడు పోటీల్లో బండలాగుతున్న వృషభాలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా చివరిరోజు శనివారం నిర్వహించిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో వైఎస్సార్‌జిల్లా మైదుకూరు మండలం పోతిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన మూలెప్రసాద్‌రెడ్డి వృషభాలు మొదటి స్థానంలో నిలిచాయి. వల్లూరు మండలం పూసలవారిపల్లెకు చెందిన వెంకటసుబ్బారెడ్డి వృషభాలు రెండవ స్థానంలో నిలవగా, గోపవరం మండలం వల్లెరవారిపల్లెకు చెందిన బండివర్ధన్ వృషభాలు మూడవ స్థానంలో నిలిచాయి. చాపాడు మండలం రాజువారిపేట గ్రామానికి చెందిన ప్రసాద్‌రెడ్డి వృషభాలు నాల్గవ స్థానంలో, పోతిరెడ్డిపల్లెకు చెందిన సూరారెడ్డి వృషభాలు ఐదవ స్థానంలో నిలిచాయి. మొదటి బహుమతి రూ.40 వేలు, రెండవ బహుమతి రూ.30 వేలు, మూడవ బహుమతి రూ.20 వేలు, నాలుగో బహుమతి రూ.10 వేలు, ఐదవ బహుమతి రూ.10 వేలు చొప్పున అందజేశారు. బండలాగుడు పోటీలను చూసేందుకు స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు.

పెద్దకొట్టాల ఎడ్లకు మొదటి బహుమతి

రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని వెల్లాలలో శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం సాయంత్రం నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్ వృషభరాజముల బండలాగుడు పోటీల్లో నంద్యాల జిల్లా పెద్దకొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి ఎద్దులు 3,808 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచాయి. ఎడ్ల యజమానికి ఆలయ చైర్మన్ జగదీశ్వరరెడ్డి దాత తిమ్మారెడ్డి సుదర్శన్ రెడ్డి, లక్ష్మిదేవిలు రూ.లక్ష పదివేల నగదును అందజేశారు. రెండవ స్థానంలో గుంటూరు జిల్లా కుంచనపల్లెకు చెందిన పీఆర్ మెమోరియల్ పులగం తిశగ్న రెడ్డి, జస్విత రెడ్డి ఎద్దులు 3,723, మూడవ స్థానంలో గుంటూరు జిల్లా కుంచనపల్లెకు చెందిన పీఆర్ మెమోరియల్ పులగం తిశగ్న రెడ్డి, జస్వితరెడ్డి ఎద్దులు 3,691, నాల్గవ స్థానంలో ప్రొద్దుటూరు మండలంలోని చౌటపల్లెకు చెందిన మార్తల చంద్ర ఓబుళరెడ్డి ఎద్దులు 3,610, ఐదవ స్థానంలో అనంతపురం జిల్లా గార్లదిన్నె రమేశ్ ఎద్దులు 3,607, ఆరవ స్థానంలో నంద్యాల జిల్లా గుంపుర్‌మాన్‌దిన్నె కుందూరు రాంభూపాల్ రెడ్డి ఎద్దులు 3,416 అడుగులు లాగి నిలిచాయి. వారికి ఆలయ చైర్మన్, దాతలు, కమిటీ సభ్యులు రూ.75 వేలు, రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలను దాతలు అందజేశారు. మిగతా ఐదు జతల ఎడ్ల యజయానులను రూ.5 వేలు ప్రోత్సాహక బహుమతులను బుక్కసముద్రం కుంటుంబ సభ్యులు అందించారు. ఎటువంటి గొడవలు జరగకుండా రాజుపాళెం ఎస్ఐ తులసీ నాగప్రసాద్ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గౌతం రెడ్డి, బాలనాగిరెడ్డి, జంగంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, జయచంద్రా రెడ్డి, గోనా వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.